సాక్షి తిరుపతి

మంగళవారం । 21 । మార్చి । 2023

సీఎం దృష్టికి టీచర్ల సమస్యలు



చిత్తూరు కలెక్టరేట్ : తాడేపల్లె క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం కలిశారు. టీచర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీ వెల్లడించారు.



పిల్లి భలే

తిరుపతి ఒకటవ డివిజన్ రెడ్డిగుంటకు చెందిన భారతమ్మ ఇంట్లో పిల్లి శ్వేతవర్ణంలో.. ఒక కన్ను బంగారు వర్ణం, మరో కన్ను నీలిరంగులో వింతగా కనిపించింది. - సాక్షిఫొటోగ్రాఫర్, తిరుపతి



విశేష పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

పంచాంగ శ్రవణం రేపు

శ్రీకాళహస్తి: ఉగాదిని పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సాగర్‌బాబు తెలిపారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు స్వామివారి సన్నిధి వద్ద ఆస్థాన సిద్ధాంతి, వేదపండితులు హెచ్‌వీ మారుతీశర్మ పంచాంగ శ్రవణం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

స్పందనకు 72 ఫిర్యాదులు



ఫిర్యాదును స్వీకరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 72 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు.

ఇంటర్ పరీక్షకు 1,886 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్, బోటని, సివిక్స్ సబ్జెక్టుల్లో పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 141 పరీక్షా కేంద్రాల్లో జనరల్‌లో 49,877 మంది, ఒకేషనల్‌లో 3,996 మంది, మొత్తం 53,873 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉంది. వీరిలో జనరల్‌లో 1,507 మంది, ఒకేషనల్‌లో 379 మంది, మొత్తం 1,886 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐఓ వి.రమేష్ తెలిపారు.

ఏ-నెగిటివ్ రక్తం అత్యవసరం

తిరుపతి తుడా : స్విమ్స్ సీటీ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న 37 సంవత్సరాల వయస్సు కలిగిన లీలావతికి అత్యవసరంగా శస్త్రచికిత్స చేసేందుకు ఏ-నెగిటివ్ రక్తం అవసరమని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ గ్రూపు రక్తం కలిగిన వారు స్విమ్స్‌లోని బ్లడ్ బ్యాంక్‌లో నేరుగా సంప్రదించి రక్తాన్ని ఇవ్వవచ్చని చెప్పారు. లేదా 0877-2287777 సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు స్విమ్స్ ఓపీకి సెలవు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 22వ తేదీ బుధవారం స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటించినట్టు మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయన్నారు. గురువారం నుంచి వైద్య సేవలు కొనసాగుతాయని చెప్పారు.

హార్ట్.. అలెర్ట్!

గుండె పోటు.. క్షణాల్లో ప్రాణాలను హరించేస్తోంది. వయసుతో సంబంధం లేకుండా మనుషులను కబళించేస్తోంది.. ఆరోగ్య రక్షణలో ఆదమరిస్తే అంతం చేసేస్తోంది.. ముఖ్యంగా మధుమేహం.. రక్తపోటు బాధితుల ఊపిరిని అవలీలగా తీసేస్తోంది. ఇందుకు మారుతున్న జీవనశైలే ప్రధాన కారణమని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. అప్రమత్తంగా ఉండకపోతే ప్రమాదంలో పడినట్లేనని హెచ్చరిస్తున్నారు. మానసిక ఒత్తిడిని జయిస్తే కాస్త ఉపయోగముంటుందని సూచిస్తున్నారు. మంచి ఆహారపు అలవాట్లు.. తగినంత వ్యాయామంతో మృత్యు నీడ నుంచి బయటపడవచ్చని వివరిస్తున్నారు.



- పెరుగుతున్న గుండెపోటు బాధితులు
- ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు
- ఆహార నియమాలు పాటించాలని..
- తగు వ్యాయామం తప్పనిసరని సూచనలు

సాక్షి తిరుపతి/చిత్తూరు రూరల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 46 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ఏడాది ఆశవర్కర్లు ఏఎన్ఎంలు నిర్వహించిన ఎన్‌సీడీ సర్వేలో భాగంగా సుమారు 42 లక్షల మందిని పరీక్షించారు. అందులో 12,02,431 మంది మధుమేహం, 1,96,772 మంది రక్తపోటుతో బాధపడుతున్నట్లు తేలింది. బీపీ, షుగర్ రెండూ ఉన్నవారు సుమారు 60 వేల మంది వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో సుమారు 12వేల మంది గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. వీరికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తూ వస్తున్నారు. అవగాహనలేమితో చాలా మంది చికిత్సకు దూరంగా ఉంటూ ఏటా వందల సంఖ్యలో గుండెపోటుకు గురవుతున్నారు. మరికొందరు గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు గుర్తించక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. హార్ట్ ఎటాక్ కేసుల్లో 20-35 ఏళ్ల వారు కూడా ఉన్నారని, చిన్న వయసులోనే బైపాస్ సర్జరీలు అవసరమవుతున్నాయని వైద్యులు వెల్లడిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ సంవత్సరం ఫిబ్రవరి వరకు దాదాపు 576 మంది గుండె సంబంధిత వ్యాధులతో ఆస్పత్రులలో చేరినట్లు వివరిస్తున్నారు.

మానసిక ఒత్తిడి.. గుండెకు బరువు

కుటుంబ బాధ్యతల కారణంగా ఒత్తిడికి గురై పలువురు హార్ట్‌స్ట్రోక్ బారిన పడుతున్నట్లు వైద్యులు తెలియజేస్తున్నారు. అలాగే పలు మానసిక సమస్యలతో కూడా గుండె పోటుకు గురవుతున్నారని స్పష్టం చేస్తున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో కొందరు దీర్ఘకాలిక రోగాల బారిన పడి సతమతమవుతున్నవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని హెచ్చరిస్తున్నారు. ఇలాంటివే చివరకు గుండె నొప్పికి దారితీస్తున్నాయని వివరిస్తున్నారు. మనసుని ప్రశాంతంగా ఉంచుకుంటూ, సమతుల ఆహార నియమాలను పాటిస్తూ, తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని వెల్లడిస్తున్నారు.

గుండెపోటుకు ప్రధాన కారణాలు...

- ఆరోగ్యపరీక్షలపై అవగాహన లేకపోవడం.
- అధిక రక్తపోటు.. అసలు బీపీ ఉందని గుర్తించకపోవడం.



- కొలెస్ట్రాల్ పెరిగిపోయి గుండెకు వెళ్లే రక్తనాళాలను పూడ్చివేయడం.
- కొవ్వు, నూనె పదార్థాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం.
- ధూమపానం. మద్యపానం







- ఎత్తు, వయసుకు మించి బరువు ఎక్కువగా ఉండడం.



- తీవ్రంగా మానసిక ఒత్తిడికి గురికావడం.



జాగ్రత్తలు పాటిస్తే జయించవచ్చు



- 35 ఏళ్లు వచ్చాక మధుమేహం, బీపీ తదితర పరీక్షలను తరచూ చేయించుకోవాలి.
- ప్రతి 6 నెలలకు ఒకసారి ఈసీజీ పరీక్ష తప్పనిసరి.
- ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారం తీసుకోవాలి.
- మధుమేహం, బీపీ ఉన్నవాళ్లు మందులను క్రమం తప్పకుండా వాడాలి.
- కొలెస్ట్రాల్ ఉన్నవారు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి.
- కఠిన వ్యాయామం చేసేముందు గుండె పరీక్షలు తప్పనిసరి
- నిత్యం యోగా, ధ్యానం చేయాలి.
- రోజూ కనీసం అరగంటపాటు నడక లేదా వ్యాయామం చేయాలి.
- జంక్‌ఫుడ్ మానెయ్యాలి
- రోజూ కనీసం 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి.

జీవనశైలిలో మార్పులే కారణం



ఆధునిక జీవనశైలి గుండె ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఒకప్పుడు 60-70 ఏళ్ల వారిలో కనిపించే గుండె జబ్బులు ప్రస్తుతం 20-35 ఏళ్ల వారికీ వస్తున్నాయి. వృత్తి, వ్యక్తిగత జీవితంలో ఒత్తిళ్ల కారణంగా చాలామంది తాత్కాలిక ఉపశమనం కోసం చెడు అలవాట్లకు బానిసవుతున్నారు. నిద్రలేకపోవడం వల్ల కూడా చిక్కులను కొనితెచ్చుకుంటున్నారు. గుండెపోటును రాకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి ఆహార అలవాట్లతో పాటు ఒత్తిడికి దూరం కావాలి. తగు వ్యాయామం చేస్తుండాలి.

– పద్మసుధాకర్, మానసిక వైద్య నిపుణుడు, చిత్తూరు

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రులు	టీచింగ్ హాస్పిటళ్లు
2	2
పీహెచ్‌సీలు	సీహెచ్‌సీలు
104	17
ఏరియా ఆస్పత్రులు	ప్రైవేట్ హాస్పిటళ్లు
5	2వేలకు పైగా
ఓపీకి వస్తున్న రోగులు	
15-20వేల మంది	
అత్యవసర సేవలకు వచ్చేవారు	
7-10వేల మంది	

అపోహలు వద్దు



మానసిక సమస్యలు, జీవన విధానంలో మార్పులు, అనారోగ్య సమస్యలు గుండెపోటుకు కారణమవుతున్నాయి. అయితే కోవిడ్ టీకాలో కొందరికి గుండె పోటు వస్తోందని ఇటీవల ఆరోపణలు వినిపిస్తున్నాయి. అది వాస్తవం కాదు. ప్రజలు ముందుగా అపోహలను వీడాలి. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉంటే హార్ట్ ఎటాక్ బారిన పడకుండా ఉండవచ్చు.

– రవిరాజు, డీఐఓ.

ప్రత్యేక చర్యలు



మధుమేహం, బీపీ ఉన్నవారు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. పీహెచ్‌సీలు, హెల్త్ క్లినిక్‌లకు వెళ్లి ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలి. గుండె సంబంధిత సమస్యలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మెరుగైన వైద్యం అందిస్తోంది.

– శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

స్పందన అర్జీలకు ప్రాధాన్యం

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు, స్పెషల్ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడుకు అర్జీల రూపంలో తెలియజేశారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 128 అర్జీలు రాగా అందులో రెవెన్యూశాఖకు సంబంధించి 108 అర్జీలు ఉన్నాయి. ఇందులో పలు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు.

సీరియస్‌గా తీసుకోండి

స్పందనలో వచ్చే అర్జీలను సీరియస్‌గా తీసుకుని పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నామమాత్రంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, డీఆర్వో, స్పెషల్ కలెక్టర్

అనుసంధానం.. విజయవంతం

- ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్ అనుసంధానం పూర్తి

సూళ్లూరుపేట: సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి ఈనెల 26న ఉదయం 9 గంటలకు ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్‌ను ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మూడు దశల రాకెట్‌ను షార్‌లోని వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో అనుసంధానం చేశారు. ఆదివారం నాటికి అనుసంధానం పనులను పూర్తి చేసి సోమవారం ఉదయం రాకెట్‌ను వ్యాబ్‌నుంచి ట్రాక్ మీద తీసుకెళ్లి ఉంబ్లికల్ టవర్ (ప్రయోగవేదిక)కు అనుసంధానం చేసే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. రాకెట్‌ను తరలించిన తరువాత దీనికి అన్ని పరీక్షలు నిర్వహించే పనులను చేస్తున్నారు. ఈనెల 23న ఎంఆర్ఆర్ సమావేశాన్ని నిర్వహించి ప్రయోగ తేదీ, సమయాన్ని అధికారికంగా శాస్త్రవేత్తలు వెల్లడించనున్నారు.



వన్‌వెబ్ ఇండియా-2 పేరుతో 36 ఉపగ్రహాలను రాకెట్‌కు శిఖర భాగంలో అమర్చుతున్న దృశ్యం

తిరుమలకు 50 విద్యుత్ బస్సులు



అలిపిరి డిపోలో విద్యుత్ బస్సులు

తిరుపతి అర్బన్: తిరుపతి నుంచి తిరుమల కొండకు సోమవారం 50 విద్యుత్ బస్సులు నడిచాయి. తిరుపతి అలిపిరి డిపోకు ఒక్కొక్కటిగా మొత్తం 82 బస్సులు చేరుకోగా అందులో పది బస్సులను రేణిగుంట ఎయిర్‌పోర్టుకు నడుపుతున్నారు. మిగిలిన 22 సర్వీసులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్నాయి. రాష్ట్రంలో తొలి విద్యుత్ బస్సుల బస్టాండ్‌గా అలిపిరి డిపో నిలిచింది. ఈ క్రమంలో తిరుపతి నుంచి 100 విద్యుత్ బస్సులను అలిపిరి డిపో కేంద్రంగా ఆపరేటింగ్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 82 బస్సులు చేరుకోగా మిగిలిన 18 బస్సులు మార్చి చివరినాటికి అలిపిరి డిపోకు చేరుకోనున్నాయి. అధికారులు అలిపిరి డిపోలో మొత్తం 48 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు.

త్వరలో 100 విద్యుత్ బస్సులు



అలిపిరి డిపోకు త్వరలో 100 విద్యుత్ బస్సులు రానున్నాయి. ప్రస్తుతం 82 బస్సులున్నాయి. ఈ డిపోకు మేనేజర్‌గా ఉండడం అదృష్టంగా భావిస్తున్నాను. పర్యావరణహితానికి ప్రాధాన్యమిస్తున్నాం.

–హరిబాబు, అలిపిరి డిపో మేనేజర్

108లో ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా : అరబిందో ఎమర్జెన్సీ 108 సర్వీసులో పైలెట్, ఈఎంటీ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ సంస్థ డీఎం పవన్‌కుమార్ తెలిపారు. హెవీ లేదా బ్యాడ్జ్ లైసెన్స్ కలిగి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు పైలెట్ పోస్టులకు, ఈఎంటీ పోస్టులకు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఎంఎల్‌టీ, బీఫార్మసీ చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తిరుపతి జిల్లాలో పెళ్లకూరు, బీఎన్ కండ్రిగ, కేవీబీపురం, తొట్టంబేడు, వరదయ్యపాళెం, గూడూరు, తడ, సూళ్లూరుపేట, వెంకటగిరి, చిట్టమూరు మండలాల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు 25వతేదీ లోపు తిరుపతి లోని తిరుమల బైపాస్ రోడ్డు మున్సిపల్ పార్కుకు సౌత్ రోడ్డులోని 108 కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్టెప్పులేసి..దుమ్మురేపి!

- ఉర్రూతలూగించిన శ్రీవిద్యానికేతన్ వార్షికోత్సవ సంబరాలు
- ముఖ్యఅతిథులుగా హాజరైన ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం, డ్యాన్స్ మాస్టర్ ప్రేమ్‌రక్షిత్


కొరియోగ్రాఫర్‌ను సత్కరిస్తున్న ఎంబీయూ చాన్స్‌లర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు


విద్యార్థులతో కలిసి నాటు నాటు పాటకు డ్యాన్స్ చేస్తున్న ప్రేమ్‌రక్షిత్

చంద్రగిరి: మోహన్‌బాబు యూనివర్సిటీలో 31వ వార్షికోత్సవ సంబరాలు సోమవారం అంబరాన్నంటాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) చైర్మన్ టీజీ.సీతారాం, ఇటీవల ఆస్కార్ అవార్డు గెలుచుకున్న నాటునాటు పాట కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ మాస్టరు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిగ్రీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు.

ప్రపంచ దేశాలకు విశ్వగురువు భారత్

ప్రపంచంలోని అన్ని దేశాలకు విశ్వగురువుగా భారతదేశం అవతరిస్తోందని ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) చైర్మన్ టీజీ సీతారాం అన్నారు. ఏ దేశానికి కష్టం వచ్చినా పెద్దన్న పాత్ర పోషిస్తోందని చెప్పారు. నాయకత్వం అనేది ఒకరు ఇస్తే వచ్చేది కాదని, అది మన లక్షణాలను బట్టి వస్తుందన్నారు. సినిమాల్లోనే మోహన్‌బాబు హీరో కాకుండా విద్యను కూడా అందిస్తూ ఎవర్‌గ్రీన్ హీరోగా నిలిచారని కొనియాడారు. మోహన్‌బాబు లాంటి వ్యక్తి గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి గొప్ప యూనివర్సిటీని స్థాపించి ప్రతి ఏడాదీ కొన్ని వేల మంది విద్యార్థులను


విద్యార్థులకు గోల్డ్‌మెడల్‌ను అందజేస్తున్న సీతారాం, పక్కన ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు

తీర్చిదిద్దడం గొప్పవిషయమన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేడు ప్రపంచంలోని అన్ని దేశాల్లో వివిధ ఉన్నత స్థాయిలో ఉండడం గర్వకారణమన్నారు. ఇటువంటి గొప్ప యూనివర్సిటీలకు ఏఐసీటీఈ సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థుల్లో 90శాతానికి పైగా ప్లేస్‌మెంట్స్ కల్పించడం అభినందనీయమన్నారు. యువతకు నాణ్యమైన విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటోందన్నారు. మేక్ ఇండియా, స్టాండప్ ఇండియా వంటి నినాదాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చినట్టు వెల్లడించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఎంబీయూ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జానపద, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆస్కార్ అవార్డు సాధించిన ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాట కొరియోగ్రాఫర్ డ్యాన్స్ మాస్టర్ ప్రేమ్‌రక్షిత్ వేదికపై విద్యార్థులతో కలిసి స్టెప్పులేశారు. అనంతరం ఎంబీయూ చాన్స్‌లర్ డాక్టర్ మోహన్‌బాబు ఆయనను సత్కరించారు. ఆర్ఆర్ఆర్ మూవీలోని నాటు నాటు పాటకు కొరియోగ్రాఫర్‌గా పనిచేసిన ప్రేమ్ రక్షిత్ మన తెలుగువాడు కావడం ఆనందంగా ఉందన్నారు.

దేవతలారా రండి!


ధ్వజారోహణ కార్యక్రమంలో వేదపండితులు


పెద్ద శేషవాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు

- ధ్వజారోహణంతో కోదండరాముని బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- పెద్దశేష వాహనంపై కనువిందు చేసిన శ్రీరాముడు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో సోమవారం ఉదయం ధ్వజారోహణంతో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభయ్యాయి. కంకణభట్టార్ ఆనందకుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం 9.20 నుంచి 9.32 గంటల మధ్య మేషలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణ, రామనామ జపం మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభం పైకి అధిష్ఠింపజేశారు.

సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడంతో పాటు సమాజ శ్రేయస్సు కు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహ దపడు తుందని అర్చకులు తెలిపారు. దీనికి ముందు ఉద యం 7 నుంచి 8.45 గంటల వరకు శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారు, ధ్వజపటం, చక్రతాళ్వారులకు తిరువీధి ఉత్సవం నిర్వహించా రు. అనంతరం 9.45 నుంచి 10 గంటల వరకు ఆస్థానం చేపట్టారు. జేఈవో వీరబ్రహ్మం మీడియాతో మాట్లాడుతూ ధ్వజారోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈనెల 22వ తేదీన ఉగాది ఆస్థానం, 24న గరుడ సేవ, 25న రథోత్సవం, 28న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.

వేడుకగా స్నపన తిరుమంజనం

శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు సోమవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారి ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు.

పెద్ద శేష వాహనంపై శ్రీకోదండరాముని వైభవం

రాత్రి శ్రీకోదండరామస్వామి పెద్ద శేష వాహనాన్ని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల మధ్య స్వామి వారి పెద్ద శేష వాహన సేవ కోలాహలంగా సాగింది. కళాకారుల భజనలు, మేళతాళాలు భక్తులను ఆధ్యాత్మిక చింతనలో ముంచెత్తాయి.

ఆయుర్వేద ఆస్పత్రిలో మెరుగైన వసతులు

తిరుపతి తుడా: ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రిని ఆధునికీకరించి మెరుగైన వసతులు కల్పించనున్నట్టు టీటీడీ జేఈఓ సదా భార్గవి తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ ఆయుర్వేద కళాశా ల, ఆస్పత్రిని సోమవారం అధికారులతో కలిసి ఆమె వివిధ విభాగాలను పరిశీలించా రు. అనంతరం జేఈఓ మాట్లాడుతూ వివిధ విభాగాలకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తోపాటు ఫర్నీచర్, ఫ్లోరింగ్, ఇతర ఇంజినీరింగ్ పనులను చేపట్టనున్నట్టు చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓపీడీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆస్పత్రి అహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. అనంతరం ఎస్వీ ఆయుర్వేద కళాశాలలోని తరగతి గదు లు, మ్యూజియం, గ్రంథాలయం, ఇతర విభాగాలను పరిశీలించారు. ఆయుర్వేద వైద్య విద్యార్థినుల హాస్టల్ భవనంలోని గదులను, డైనింగ్ హాల్, కిచెన్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీఈ నాగేశ్వరరావు, ఎఫ్ ఏఅండ్ సీఏఓ బాలాజీ, ఎస్ఈ వెంకటేశ్వర్లు , డీఈఓ భాస్కర్ రెడ్డి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ, ఆయుర్వేద ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్ పాల్గొన్నారు.


ఆయుర్వేద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడ్ని పరామర్శిస్తున్న జేఈఓ

పంట నష్టంపై నివేదికలివ్వండి

తిరుపతి అర్బన్: అకాల వర్షంతో దెబ్బతిన్న పంటల వివరాలు ఈనెల 30వ తేదీలోపు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు సిబ్బందిని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,300 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. ఇందులో 1,100 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో వేరుశనగ దెబ్బతిన్నట్టు తేలిందన్నారు. ఉద్యాన శాఖాధికారి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 70 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, ఆ మేరకు నివేదిక ఇచ్చామన్నారు. గూడూరు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో పంట నష్టం జరిగినట్టు వెల్లడించారు. శ్రీకాళహస్తిలో నిమ్మ, మిరప, పుచ్చ పంటలకు సంబంధించి 61 ఎకరాల్లో నష్టం జరిగిందని, ఇక గూడూరు నియోజకవర్గంలో 9 ఎకరాల్లో బంతిపూల తోటలకు నష్టం జరిగినట్లు వెల్లడించారు.

నిందితునికి రిమాండ్

పిచ్చాటూరు: బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడు మధురెడ్డి(30)కి సత్యవేడు న్యాయస్థానం 15 రోజులు రిమాండ్ విధించినట్లు నాగలాపురం ఎస్ఐ హనుమంతప్ప వెల్లడించారు. నాగలాపురం మండలానికి చెందిన మధురెడ్డి ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికపై ఆమె ఇంట్లోనే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నాగలాపురం ఎస్ఐ హనుమంతప్ప నిందితుడు మధురెడ్డిపై ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి సోమవారం సత్యవేడు సీఐ శివకుమార్‌రెడ్డి సమక్షంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు.

నిశీధిలో నిండు ప్రాణాలు బలి


మృతిచెందిన యువకులు


ఎలకచర్ల అరుణ్(ఫైల్)


దండు వెంకటరమణ(ఫైల్)

- డివైడర్ ఢీకొని ఇద్దరు యువకుల మృతి
- సరిహద్దులో ఘటన

తడ: బైక్‌పై వెళ్తూ చిమ్మచీకట్లో ఎదుటే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లా, కలువాయి మండలం, నూకనపల్లెకి చెందిన యలకచర్ల అరుణ్(26), దండు వెంకటరమణ(27) మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి కథనం .. చెన్నైలో పనిచేసే అరుణ్‌కి 9 నెలల క్రితమే వివాహమైంది. అక్కడే కాపురం పెట్టిన ఇతను ఆదివారం తన బైక్‌పై స్వగ్రామం వచ్చాడు. సాయంత్రం తిరుగుపయనం అయిన అరుణ్‌తోపాటు తన మిత్రుడు బంధువైన వెంకటరమణతో కలిసి చెన్నై బయలుదేరాడు. అర్ధరాత్రి సమయంలో తమిళనాడు సరిహద్దుకు చేరున్న వీరికి జాతీయరహదారి నుంచి ఎళావూరు చెక్‌పోస్టు వైపు దారిమళ్లింపుకోసం ఏర్పాటు చేసిన సిమెంటు డివైడర్ దిమ్మెలు కనిపించక పోవడంతో వేగంగా ఢీకొట్టారు. దీంతో ఇద్దరి తలలు డివైడర్‌కి తగిలి అక్కడికక్కడే మృతిచెందారు. హెల్మెట్ ధరించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. వీరు పడిన ప్రదేశం మలుపు మరుగుగా ఉండడంతో రాత్రి సమయంలో ఎవరూ గుర్తించలేదు. సోమవారం తెల్లవారు జామున వాహనదారులు గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రమాదం జరిగిన చోటు ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల్లోని తడ, ఎళావూరు పోలీస్ స్టేషన్‌ల మధ్య ఉండడంతో రెవెన్యూ అధికారుల సహాయం తీసుకున్నారు. తమిళనాడుకు అడుగు దూరంలో ప్రమాదం జరిగిందని తేలడంతో తడ పోలీసులు చర్యలు చేపట్టి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బైక్ నంబర్ ఆధారంగా మృతుల స్వగ్రామాన్ని గుర్తించి కలువాయి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కలువాయిలో విషాదఛాయలు

కలువాయి: కలువాయి మండలం, నూకనపల్లెలో విషాదఛాయలు అలముకున్నాయి. తమిళనాడు సరిహద్దు వద్ద జరిగిన ప్రమాదంలో గ్రామానికి చెందిన ఎలకచర్ల అరుణ్, దండు వెంకటరమణ మృతిచెందారు. అరుణ్‌కు ఏడాది క్రితం వివాహం కాగా.. వెంకటరమణ అవివాహితుడు. అరుణ్, వెంకటరమణల ఇళ్లు పక్కపక్కనే ఉండడంతో ఇద్దరూ స్నేహంగా ఉండేవారు. ఆదివారం ఉదయం నూకనపల్లి నుంచి వారు చెన్నైకి బయలు దేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి మృతితో నూకనపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

త్వరితగతిన తాళపత్రాల స్కానింగ్

- దేశానికి ఐకాన్‌గా టీటీడీ మానుస్క్రిప్ట్స్ ప్రాజెక్టు
- సమీక్షలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడి


సమీక్షిస్తున్న ఈవో ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న మాను స్క్రిప్ట్స్ ప్రాజెక్టు దేశానికే ఐకాన్‌గా తయారు కావాలని ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. ఇక్కడ స్కాన్ చేసి భద్రపరిచిన మాను స్క్రిప్ట్స్‌పై పీహెచ్‌డీలు చేసే స్థాయికి తీసుకుని రావాలని సూచించారు. మానుస్క్రిప్ట్స్ ప్రాజెక్టు ప్రగతిపై సోమవారం శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు ప్రగతిపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పురావస్తుశాఖ నుంచి తెచ్చిన సుమారు 5,500 తాళపత్ర గ్రంథాల్లో ఇప్పటివరకు 3,370 గ్రంథాలు స్కాన్ చేసినట్టు వెల్లడించారు. ఇందులో 2,11,313 తాళపత్రాలు ఉన్నట్లు చెప్పారు. రెండు నెలల్లో మిగిలిన గ్రంథాలను కూడా స్కాన్ చేయడానికి అవసరమైన సాంకేతిక సహకారం, సిబ్బందిని ఇస్తామని ఈవో వివరించారు. ఇవి తెలుగులో తర్జుమా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇలా తర్జుమా చేసిన వాటిని పుస్తక రూపంలో తేవడానికి ఒక ప్రాజెక్టు తయారు చేసి ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఈ పుస్తకాల ఆధారంగా పీహెచ్‌డీ చేయడానికి అవసరమైన వాతావరణం కల్పించాలని చెప్పారు. జేఈవో సదా భార్గవి, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, మాను స్క్రిప్ట్స్ ప్రాజెక్టు డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యాం పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్త


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: 'జిల్లాలో ఈ ఏడాది ఎండల తీవ్రత అధికం. 48–49 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. వడగాడ్పులు కూడా బలంగా ఉంటాయి. వీటి నుంచి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి' అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం ఎండల తీవ్రతకు సంబంధించి జేసీ డీకే బాలాజీతో కలసి అధికారులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎండల తీవ్రత, వడగాడ్పులు నమోదు కానున్న నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం, జిల్లా, మండల స్థాయిలో కంట్రోల్ రూముల ఏర్పాటు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు మజ్జిగ పంపిణీ, చలి వేంద్రాల ఏర్పాటు లాంటివి చేయాలన్నారు. రోజూ నమోదు కానున్న ఎండ తీవ్రత వివరాలు మీడియాకు అందించి ప్రత్యేక కాలమ్ ఏర్పాటుతో ప్రచురించేలా చూడాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల సభ్యుల సహకారం తీసుకోవాలన్నారు. గ్రామాలలో పశువుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ టబ్స్‌లో ఎప్పటికప్పుడు నీరు నింపేలా, విద్యుత్ అంతరాయం కలిగితే చేతి పంపులు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. పాఠశాలల పిల్లలకు సంబంధించి ప్రభుత్వం త్వరలో స్కూల్ సమయం నిర్ణయించనుందని ఆ సమయం ప్రకారం వెంటనే పిల్లలు ఇంటికి చేరేలా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మధ్యాహ్నం 12–4 గంటల సమయంలో అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. ఈ సమీక్షలో డీఆర్వో శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, డీఈఓ శేఖర్, సెక్షన్ సూపరింటెండెంట్ పరమేశ్వరస్వామి, వైద్యశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బాలకృష్ణా రెడ్డి, రాజా రెడ్డి, మార్కండేయ రెడ్డి, సుబ్రహ్మణ్యం, అరుణ, అమరేంద్ర, గౌరీ, సుమలత పాల్గొన్నారు.

ఉచితంగా నైపుణ్య శిక్షణ

తిరుపతి అర్బన్: తిరుపతిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ వారు ప్రధాన మంత్రి కౌశల్ వికాస యోజన పథకంలో భాగంగా 15–45 ఏళ్ల నిరుద్యోగ యువతీయువకులకు వివిధ నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తిరుపతి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి సోమవారం తెలిపారు. ప్రధానంగా ఎలక్ట్రికల్, ఫిట్టర్, ఆటోమెటిక్ సర్వీస్ (టూ వీలర్ అండ్ ఫోర్ వీలర్)పై శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల అధికారులు ట్రైనింగ్ ఆఫీసర్ ఏ.రాజును సంప్రదించాలని కోరారు. అదనపు సమాచారం కోసం 8500021856, 7799679351, 7995479269, 9492861369 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.